# అమ్మ మనసు

- డేగల అనితాసూరి

పూజ చేయడం పూర్తి చేసాక చెంపలు వేసుకుని హారతిచ్చి కొబ్బరి కాయ కొట్టింది అమ్మ.

అందరం గుంజీలు తీశాం. కళ్ళు మూసుకుని మనసులో ఓసారి ప్రార్థించుకున్నాక కళ్ళు తెరిచా. అప్పటికే నాన్న, తమ్ముడు వెళ్ళిపోయారు. నేనూ పూజ గదిలోంచి ఇవతలికి రాబోతూ అమ్మ వంక చూశాను. ఆమె ఇంకా కళ్ళు మూసుకుని ప్రార్థిస్తూనే ఉంది.

"మరి నాన్న గురించీ, నా గురించీ, మావారి గురించీ, తమ్ముడి గురించీ వాడి ఉద్యోగం గురించీ పేరుపేరునా ప్రార్థించాలి కదా. అప్పుడే ఎలా వస్తుంది?'' అనుకుంటూ నేను హాల్లోకొచ్చాను.

హాల్లో అప్పటికే నాన్న, తమ్ముడు టీవీ ఆన్ చేసుకుని వినాయకచవితి స్పెషల్ ప్రోగ్రామ్స్ చూస్తుంటే నేనూ వెళ్ళి సోఫాలో కూర్చున్నాను.

అమ్మ పదినిముషాల తర్వాత తీర్థం తీసుకొచ్చి ఇచ్చింది. దేవునికి నివేదించిన కుడుములు, ఉండ్రాళ్ళు, గుగ్గిళ్ళు, పాయసం, గారెలు కళ్ళకద్దుకుని రుచి చూసి భోజనాలకు లేచాం.

"అమ్మా... అంతసేపు ఏం వేడుకున్నావేంటి దేవుడ్ని?'' అడిగాను అన్నంలోకి ములక్కాడల సాంబారు వేసుకుంటూ.

"ఏముందీ. బాబుక్కూడా ఈ ఊళ్ళోనే ఉద్యోగం వచ్చేస్తే చాలు స్వామీ అని. అందరూ బాగుండాలని'' చెప్పింది అమ్మ నాన్న విస్తరాకు పక్కన మంచినీళ్ళ గ్లాసు పెడుతూ.

"నీది మరీ చోద్యమమ్మా. ఎంత దేవుడైతే మాత్రం తీర్చలేని కోరికలు కోరి ఇబ్బంది పెడ్తే ఎలా?'' అన్నాన్నేను.

"అలా చెప్పమ్మా మీ అమ్మకు. కొడుకు ఇరవై నాలుగ్గంటలూ కళ్ళముందే ఉండాలంటే వాడేమైనా ఆడపిల్లా? వాడి చదువుకు తగ్గ ఉద్యోగం చేయద్దూ. ఏ హైదరాబాదో, బెంగుళూరో వెళ్లకుంటే వాడి భవిష్యత్తు ఏమౌతుందంటే విన్పించుకోదు'' ఆమె మొండితనం గురించీ అన్నారు నాన్న.

"మీరెప్పుడూ ఇంతే. వాడ్నెక్కడ్కికైనా పంపేసి ఉద్యోగం వెతుక్కోమంటారే గానీ వాడుంటానన్నా మీరు వాడ్ని ఇక్కడ ఉండనిచ్చేలా లేరు'' కోపంగా పెరుగు వడ్డించుకుంటూ అంది అమ్మ.

"నీ ఇష్టం నా ఇష్టంతో కాదు ఉద్యోగం వచ్చేది. ఎక్కడవాడికి ప్రాప్తం ఉంటే అక్కడొస్తుంది'' అనేసి చేయి కడుక్కుని వెళ్ళిపోయారు నాన్న.

"అమ్మా.. ఏంటి నువ్వు చెప్పేది? నువ్వే ఆలోచించు. వాడు ఎంసిఏ చదివాడు. మంచి ఉద్యోగం రావాలంటే పెద్ద సిటీల్లోనే కదా ఏదైనా కంపెనీలుంటాయి. అలాంటివి మనూళ్ళో ఒక్కటైనా ఉందా? మరి ఇక్కడ ఎలా ఉద్యోగం వస్తుంది చెప్పు. అయినావాడు మూడు సంవత్సరాలు నంద్యాలలో చదువుకున్నాడు. హైదరాబాద్‌లో ప్రాజెక్ట్ చేశాడు. వాడి ఫ్రెండ్సంతా హైదరాబాద్, బెంగుళూరు, మద్రాసుల్లో సెటిలౌతున్నారు. వాడికి మాత్రం మంచీ చెడూ తెలీదేంటి? మనతోనే అట్టిపెట్టుకోవాలంటే ఎలా కుదురుతుంది చెప్పు?'' అన్నాను నేను.

"నువ్వూ అలాగే మాట్లాడ్తేవేంటి అమ్ములూ! ఇప్పటికే నీకా గవర్నమెంట్ ఉద్యోగం హైదరాబాద్‌లో వచ్చింది. ట్రాన్స్‌ఫర్స్‌కి కూడా వీల్లేదనడంతో మీ ఆయన చాలా కష్టపడి అక్కడికి రాగలిగాడు. అంతదూరాన మీరిద్దరే ఎలా ఉన్నారో ఏంటోనని నేనిక్కడ కంగారుపడుతుంటాను. ఇక బాబుక్కూడా వేరే ఎక్కడో ఉద్యోగం వస్తే ఎలా చెప్పు? సొంత ఇల్లూ, వాకిలీ వదులుకుని మేమూ ఎక్కడికీ రాలేము. చదువుకోసం ఇన్నాళ్ళూ బయట ఉండి ఇపుడేగా ఇంటికొచ్చాడు. చూడెలా పీక్కుపోయాడో. ఫ్రెండ్స్‌తో తిరగడం, వేళకు తినకపోవడంతో ఇలా తయారయ్యాడు. ఇంటి భోజనం చేస్తూ కాలేజ్‌కి వెళ్ళేటప్పుడు ఎంత బాగుండేవాడు మనిషి'' తమ్ముడి వైపు బాధగా చూస్తూ అంది.

"ఏం కాదులే అమ్మా. నేను బాగానే తింటున్నాను. నువ్వూర్కే దిగులుపడకు. నా ఫ్రెండ్స్ అంతా హైదరాబాద్‌లో బెంగుళూర్లో ఉన్నారు. ఇంటర్వ్యూలకు అటెండవుతుంటే తప్పకుండా ఉద్యోగం వస్తుంది. అయినా బెంగుళూరు ఎంత దూరం? ఇక్కడ్నుంచీ ఐదుగంటల ప్రయాణం. వారం వారం వచ్చేస్తాను. ఇక హైదరాబాద్ అయినా అక్కా వాళ్ళున్నారు కదా'' వాడు చెబుతుండగానే బయట వాడి ఫ్రెండ్స్ పిలుస్తుండడం విన్పించి వెళ్లాడు బాబు.

"చూశావా...వీడి మాటలు. అసలు నిన్నే మన వైపు ఎక్కడ్కికైనా ట్రాన్స్‌ఫర్ చేసుకుని వచ్చే వీలుందేమో చూడమందామని నేనుంటే , వాడేమో అలా మాట్లాడ్తాడు. సరే మీ ఇష్టం. ఆరోగ్యం గురించీ పట్టించుకోకుండా ఫ్రెండ్స్‌తో తిరిగి ఎక్కడ పాడైపోతాడో అనే నా దిగులంతా'' అంది అమ్మ.

అవును. అమ్మకెప్పుడూ మా గురించే బెంగ. నాన్న డ్యూటీ నుంచీ రావడం కాస్త ఆలస్యం అయినా హైదరాబాద్‌లో ఎక్కడో వర్షం పడి లోతట్టు ప్రాంతాలు మునిగాయనో లేక పాతబస్తీలో చిన్న గొడవలనో టీవీల్లో వార్తలు వస్తే ఆరోజంతా రెండుమూడు సార్లు ఫోన్స్ చేయడం...ఇలా అన్నిటికీ ఆదుర్దా పడ్తే ఎలా? ఎవ్వరైనా ఇదెక్కడి చోద్యం అనుకుంటారు. ఆమె గురించీ ఇంట్లో అందరికీ తెలుసు. అంతే కరెక్టుగా ఏ రెండు మూడు వేలకో తప్ప ఈ ఊళ్ళో అంతకుమించి ఇచ్చే ఉద్యోగాలేం ఉండవనీ తెలుసు. మరీ సిటీల్లోలాగా ఇరవై, ముప్ఫై వేలు కాకున్నా ఉన్న ఊళ్లో పదివేలైనా చాలని అంటుంది అమ్మ. నిజమే. అలా కుదిర్తే మేము మాత్రం సంతోషించమా. ఎలా అయినా అడ్జస్ట్ కావాలనే అమ్మకు చెప్పాం.

* * *

"ఆంటీ..తరీష్ ఉన్నాడా?'' అంటూ బాబు ఇక్కడ చదువుతున్నప్పుడు క్లాస్‌మేట్ అయిన చంద్ర వచ్చాడు. ఇంట్లో బాబు అంటాం. వాడి పేరు మాత్రం తరీష్.

"ఆ...స్నానం చేస్తున్నాడు. కూర్చోబాబు'' అంటూ అమ్మ అతనికి సోఫా చూపించింది. ఫ్రిజ్‌లోంచి రస్నా బాటిల్ తీసి గ్లాసులో కలపసాగింది.

ఐదునిముషాల తర్వాత బాబు వచ్చాడు. చంద్రని చూస్తూనే త్వరత్వరగా తయారై టిఫిన్ కూడా చెయ్యకుండానే ఇద్దరూ కలిసి ఎక్కడికో వెళ్ళారు.

"హైదరాబాద్ నుంచీ వచ్చాక నిజంగానే వీడికి ఫ్రెండ్స్ ఎక్కువయ్యారు. బాగా పొద్దెక్కాక నిద్రలేవడం, స్నానం కూడా ముగించకుండానే ఫ్రెండ్స్ రావడం. మళ్ళీ భోంచేశాక సాయంత్రాలు వెళ్లడం. రాత్రి తొమ్మిది గంటలు దాటాక ఇల్లు చేరడం. ఇక్కడే ఇలా ఉంటే ఉద్యోగం వచ్చి సిటీలోనే ఉండాల్సొస్తే ఎలా తయారౌతారో'' అనుకున్నాన్నేను.

సాయంత్రం అమ్మ పూజ గదిలో దీపం పెడుతోంది. తమ్ముడికి ఇక్కడే ఉద్యోగం వస్తే షిర్డీ వస్తానని, వెంకటేశ్వరునికి వాడి మొదటి నెల జీతం ముడుపుగా వేస్తానని ఏవేవో మొక్కేస్తోంది. 'ప్చ్.. ఎంతచెప్పినా ఈమె పద్ధతి మారదు' అమ్మ తెచ్చినే కుంకుమ భరిణెలోంచి వేలితో కుంకుమ తీసుకుని

పాపిట అద్దుకుంటూ నిట్టూర్చాను.

* * *

అప్పుడే నేను వినాయకచవితికని అమ్మ వాళ్ళ ఊరొచ్చి వారం గడిచిపోయింది. ఇంక నా లీవ్ రెండురోజులు మిగిలుంది. ఆరోజు ఉదయం ఎనిమిదిగంటలకల్లా హైదరాబాద్‌నుంచీ మా వారొచ్చారు నన్ను తీస్కెళ్లడానికి. లగేజ్ సర్దుకోవడంలో బిజీగా ఉన్నాన్నేను. అమ్మేమో అల్లుడుగారొచ్చారని స్పెషల్ వంటకాల తయారీలో ఉంది. హాల్లో నాన్న, మావారు మాటల్లో పడ్డారు. ఇంతలో ఏదో పని ఉందంటూ ఉదయాన్నే బయటకెళ్ళిన బాబు, వాడి ఫ్రెండ్ వచ్చారు. వారి ముఖాల్లో ఏదో తెలీని ఆనందం.

"ఏంటి బావగారూ కులాసానా? ఎలా ఉంది మీ జాబ్" వస్తూనే పలకరించాడు వాళ్ళ బావగార్ని.

"అంతా బాగానే ఉంది. మరి నీ..." అంటూ వీడి ఉద్యోగం వేట ఎందాకా వచ్చిందని కాబోలు అడుగుతుండగానే-

"బావగారూ...మంచి సమయానికే వచ్చారు. ఇవ్వాళ నేను ఇంటర్వ్యూలో సెలెక్టయ్యాను" అమ్మ తెచ్చిన ట్రేలోంచి కాఫీ కప్పు తీసి మావారికి ఇస్తూ చెప్పాడు.

"ఇంటర్వ్యూనా..ఎక్కడేవిట్రా?" చంద్రానికీ కాఫీ ఇస్తూ అడిగింది అమ్మ.

"ఇక్కడే ఆంటీ... కాణిపాకం రూట్‌లో ఉన్న శ్రీనివాసా ఇంజనీరింగ్ కాలేజ్‌లో ఇంటర్వ్యూ. ఉన్న ఒక్క ప్రోగ్రామర్ పోస్ట్‌కీ ఇరవైమంది వచ్చారు. తరీష్ సెలెక్టయ్యాడు లక్కీగా. జీతం





నెలకు ఎనిమిదివేలు" హేపీగా చెప్పాడు చంద్ర.

"అబ్బే... వాడి చదువుకి ముప్ఫై నలభై వేలిస్తారు. సిటీల్లో ఐతే సర్లే. ముందు ఏదో దాన్లో చేరనీ. తర్వాత మంచి కంపెనీల్లో ట్రై చేస్కోవచ్చు" కాస్త అసంతృప్తిగా అన్నారు నాన్న.

"మీరాగండి... ఐదు వేలైనా వాడు ఇంటిపట్టునుంటే అదే చాలు" నాన్నను విసుక్కుని "కాణిపాకం వినాయకా. నా మొర ఆలకించావా తండ్రీ. ఆ చేత్తోటే మా అమ్మాయిని కూడా ఇక్కడికి ట్రాన్స్‌ఫర్ చేయించు స్వామీ!" ఆమె గోడమీది క్యాలెండర్ వైపు తిరిగి దండం పెట్టుకుంటోంది.

తమ పిల్లలు విదేశాల్లో ఉంటే స్టేటస్ పెరుగుతుందనో, బాగా సంపాదించి తెస్తారనే భావించే తల్లిదండ్రులున్న ఈరోజుల్లో దగ్గర్లో ఉన్న సిటీలో చాలని నాన్నంటే, కళ్లముందే ఉండాలని కోరుకునే అమ్మ..ఇలాంటి తల్లిదండ్రులు లభించడం మా అదృష్టం.

"చూశావా అమ్ములూ.. నా మొక్కులూ, ప్రార్థనలూ ఫలించవని మీరంతా భావించారు. ఆయన తలచుకుంటే ఏది జరగదు? నా మనసు మీకెవరికీ అర్థంకాదు" అంటున్న అమ్మ చేతిలోని వినాయకుని క్యాలెండర్‌కున్న చామంతిపువ్వు "నీ అమ్మ మనసు నాకు తెలుసుగా!" అన్నట్టు జారింది.

★